12.11.2000



# స్వార్థం

'ఏమండీ! మొన్న వచ్చి వెళ్ళిన అబ్బాయి తరఫువాళ్ళేమైనా కబురంపారా? అప్పుడే ఇరవైరోజులు గడిచిపోయాయి' సీతమ్మ భర్తనడిగింది.

దీర్ఘాలోచనలో మునిగివున్న పట్టాభిరామయ్య తపోభంగమయినట్లు ఉలిక్కిపడ్డాడు.

'ఆс... అవును... లేదు...' అంటూ తడబడ్డాడు.


'ఏమండీ! నిజం చెప్పండి. నేను గమనిస్తూనే వున్నాను. భారతి పెళ్ళి విషయంలో మీరెందుకో అంత శ్రద్ధ చూపడంలేదు. ఇంతకుముందు వచ్చిన రెండు, మూడు సంబంధాల విషయంలో కూడ మీరు చెప్పిన మాటలు నాకు అంత సబబుగా అనిపించలేదు. ఇప్పుడు నా అనుమానం పూర్తిగా నిజమనిపిస్తోంది. చూడబోతే భారతికి పెళ్ళి చేయడం మీకు బొత్తిగా ఇష్టమున్నట్లు లేదు. ఎందుకని?' ఎన్నాళ్ళనుంచో మనసులో అణచుకున్న ఆవేదన, ఆక్రోశం, ఆందోళన ఒక్కసారిగా వెళ్ళగక్కింది సీతమ్మ.

'భారతికి పెళ్ళి చేయడం మీకు బొత్తిగా ఇష్టమున్నట్లులేదు-' భార్య మాటలు ఈటెల్లా పట్టాభిరామయ్య గుండె లోతుల్లోని సున్నితపు అంచుల్ని తాకాయి. కసాయి వేటగాడి పదునైన బాణం తగ్గిలిన పక్షిలా విలవిలలాడిపోయాడాయన. అతని కళ్ళు చెమర్చాయి. ముఖం వివర్ణమయింది. అతను తన భావోద్వేగాన్ని అణచుకుంటూ అన్నాడు. 'అవును, భారతికి ఇప్పుడిప్పుడే పెళ్ళి చేయడం నాకిష్టంలేదు.'

'ఇదేం విడ్డూరమండీ! దానికిప్పుడే పాతికేళ్ళు నిండాయి. ఇన్ని రోజులు చదువులనీ, ఉద్యోగాలనీ ఆగాం. అది ఉద్యోగంలో చేరికూడ రెండేళ్ళు కావస్తోంది. రెండుమూడునెలల్లో అమెరికా కూడ వెళుతోంది. దానికేం తక్కువని ఇంకా పెళ్ళి విషయంలో ఆలస్యం చెయ్యాలి?' సీతమ్మ వాదించసాగింది.

'దానికేమీ తక్కువకాదు. అన్నీ మనకే తక్కువ. అమ్మాయి పెళ్ళి చేసుకుని తన దారి తాను చూసుకుంటే, మన ఇద్దరి సంగతి వదిలెయ్యి. దాని వెనక వున్న ముగ్గురమ్మాయిల సంగతి ఆలోచించావా?'

'ఇదా మీ మనసులోని పన్నాగం! ఎప్పుడో పెళ్ళిళ్ళు చేయాల్సిన వారి కోసం ఇప్పుడు దీని పెళ్ళి చెడగొట్టి గొంతుకోస్తారా? పెళ్ళికి తగిన వయస్సు దానిది. మంచి ఉద్యోగంలో వుంది. మంచి సంబంధాలు వస్తున్నాయి. ముంగిట్లోకివచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోవడం మంచిదికాదు. ఇక మిగిలిన పిల్లల పెళ్ళిళ్ళంటారా! భారతి సంపాదిస్తేనే పెళ్ళి చేస్తామని కన్నామా? నారు పోసినవాడు నీరుపోయక మానడన్నట్లు,



కొమ్మిశెట్టి మోహన్

ఆ ఘడియ వస్తే ఆ భగవంతుడే వారికి ఒక దారి చూపుతాడు.'

భార్యకు ఎలా నచ్చజెప్పాలో పట్టాభిరామయ్యకు బోధపడలేదు. తనకు మాత్రం కూతురుపట్ల ప్రేమలేదూ? కానీ జీవితంలో సెంటిమెంట్లతోపాటు కొంత ప్రాక్టికల్ థింకింగ్ కూడ అవసరం. సీతమ్మలో స్త్రీ సహజమైన సెంటిమెంట్లు డామినేట్ చేస్తున్నాయి. పట్టాభిరామయ్య ప్రాక్టికల్ థింకింగ్ సెంటిమెంట్లని డామినేట్ చేస్తోంది.

అతను నచ్చజెబుతున్న ధోరణిలో అన్నాడు 'చూడు సీతా! నేను చెప్పేది కొంచెం జాగ్రత్తగా ఆలోచించు. మిగిలిన ముగ్గురు ఆడపిల్లలకి కూడ కనీసం రెండు మూడేళ్ళలో వరుసగా పెళ్ళిళ్ళు చేయాలా? లేదా? ఎంత లేదనుకున్నా ఒక్కొక్కరికి రెండు లక్షలైనా కావాలి. మరి భారతి సహాయం లేనిదే మనం నెట్టుకురాగలమా? అమ్మాయి అమెరికా వెళుతోంది. కనీసం రెండేళ్ళు అక్కడ పనిచేస్తే కొంత డబ్బు తప్పక మిగులుతుంది. అప్పుడు భారతి పెళ్ళితోపాటు మిగిలిన అమ్మాయిల పెళ్ళిళ్ళు కూడ సులభంగా చేయవచ్చు. నా ఆలోచన తప్పంటావా? ఇందులో నా స్వార్థముందంటావా? చెప్పు!'

'మీరేమైనా చెప్పండి. నాకెందుకో మనసంగీకరించడంలేదు. భారతికి మనం అన్యాయం చేస్తున్నామనే నాకనిపిస్తోంది. తర్వాత వాళ్ళ అదృష్టమెలా వుంటే అలా జరుగుతుంది. ముందు భారతి పెళ్ళికానివ్వండి.' సీతమ్మ ఆర్ద్ర నయనాలతో వేడికోలుగా పట్టాభిరామయ్య చేతులు పట్టుకుంది.

ఇంతలో సీతమ్మ కోసం పొరుగింటావిడెవరో రావడంతో వారి సంభాషణ ఆగిపోయింది. పట్టాభిరామయ్య ఏదో పని మీద బయటకు వెళ్ళిపోయాడు.

** ** **

పట్టాభిరామయ్య మధ్యతరగతికంటే కొంచెం కిందిస్థాయి కుటుంబీకుడనడమే సబబుగా వుంటుంది. అతను ఒక పెద్ద బట్టల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. పాతిక సంవత్సరాల క్రితం తన ఇరవైరెండేళ్ళ వయసులో ఆ దుకాణంలో నెలకు రెండువందల రూపాయల జీతంతో చేరాడు. ప్రస్తుతం నెలకు మూడువేల జీతం తీసుకుంటున్నాడు. పట్టాభిరామయ్య షాపులో వున్నాడంటే యజమానికి కొండంత ధైర్యం, ఊరట. తన బట్టల దుకాణం పట్టణంలోనే నంబర్‌వన్ స్థాయిలో ఉందంటే అందులో సగం గౌరవం పట్టాభిరామయ్యకు కూడ దక్కుతుందని యజమానికి తెలియందికాదు. అందుకనే ఆయన పట్టాభిరామయ్యను ఒక పనివాడిగా కాకుండా తన స్వంత మనిషిలా గౌరవించేవాడు.

పట్టాభిరామయ్యను బంధుమిత్రులందరూ 'ఆడపిల్లల తండ్రి' అంటూ తమాషాగా ఆటపట్టించేవారు. మొదట్లో కొంత బాధపడినా తర్వాత తర్వాత అలవాటుగా మారి అతను కూడా ఈ కామెంట్‌ని తేలిగ్గానూ, సరదాగానూ తీసుకునేవాడే తప్ప సీరియస్‌గా తీసుకోలేదు. అతనికి మొత్తం నలుగురమ్మాయిలు. భారతి మొదటి సంతానం. ఆ తర్వాత ఒక్క కుమారుడైనా పుట్టకపోతాడా? అనే ఆశతో ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పు కుంటూ నలుగురమ్మాయిల్ని కన్న తర్వాతగానీ ఆ దంపతులు కళ్ళు తెరచి వాస్తవ ప్రపంచంలోకి రాలేదు. కానీ అప్పటికే చేయి దాటిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు- చింతిస్తూ కూచుంటే లాభంలేదని వారెంతో గుంభనంగా పిల్లల్ని పెంచుతూ వచ్చారు.

తాను హైస్కూల్ చదువు కూడ పూర్తి చేయలేకపోయినా తన పిల్లల్ని బాగానే చదివించాలనుకున్నాడు పట్టాభిరామయ్య. తన ఆశయాలను, ఆశలను అర్థం చేసుకున్నట్లు అమ్మాయిలు కూడ ఎంతో ఒద్దికగా తమ పనులు చేసుకుపోసాగారు. నలుగురమ్మాయిల్లోనూ భారతి చాల చురుకైంది. పువ్వుపుట్టగానే పరిమళించునన్నట్లు భారతి మొదట్నుంచీ ఫస్టుర్యాంకులోనే వుంటోంది. ఇంటర్‌లో ఫస్టుక్లాసు తెచ్చుకోవడమేగాకుండా ఎనభైశాతం మార్కులు సంపాదించింది. సెకండరీ గ్రేడు ట్రెయినింగో లేక బియస్సీ చదివించి బి.ఇడి ట్రెయినింగో చేయించి ఒక ఉపాధ్యాయునికిచ్చి పెళ్ళి చేస్తే సరిపోతుందని అనుకున్నాడు పట్టాభిరామయ్య. కానీ భారతి తెలివితేటల్నీ, ఉత్సాహాన్నీ కాదనలేక ఎంసెట్ రాయించాడు. సహజంగానే మంచి ర్యాంకు రావడంతో స్వంత పట్టణంలోని ఇంజనీరింగు కాలేజీలోనే కంప్యూటర్ ఇంజనీరింగులో ఫ్రీసీటు వచ్చింది. ఇక అడ్డు చెప్పడానికి పట్టాభిరామయ్యకు ఏ కారణం కనిపించలేదు.

కానీ సీతమ్మకెందుకో భయంభయంగానే వుంది. 'ఆడపిల్లకు మనస్థోమతకు తగిన చదువులు చెప్పించడమే మంచిది. అంత పెద్ద చదువులు చెప్పిస్తే రేపు దానికి అంత హోదాగల భర్తను తీసుకు రావాలికదా!' అంది.

ఎంతోమంది సీటు తెచ్చుకోలేక లక్షలు ఖర్చుచేసైనా చదువుకోవాలనుకుంటుంటే స్వతహాగా వచ్చిన సీటు వదులుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఒకవేళ అబ్బాయే అయితే మనం ఇంతగా ఆలోచించే వాళ్ళమా?' పట్టాభిరామయ్య భార్యకు నచ్చజెప్పాడు.

అలా చూస్తూ వుండగానే భారతి కంప్యూటర్ ఇంజనీరయింది. కోర్సు ఇంకా రెండు, మూడు నెలల్లో పూర్తవుతుందనగా ఒక ప్రసిద్ధ కంప్యూటర్ కంపెనీవారు క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్టు చేశారు. కోర్సు పూర్తికాగానే హైదరాబాదులో కంప్యూటర్ ఇంజనీర్‌గా జాయినయ్యింది భారతి. ఉద్యోగంలో చేరి అప్పుడే ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. పట్టాభిరామయ్య మిగిలిన ముగ్గురమ్మాయిలు భారతిలా గొప్ప చురుకైనవారు కాకపోయినా అక్కను ఆదర్శంగా తీసుకుని ఆ స్ఫూర్తితో బాగానే చదువుతున్నారు. రెండో అమ్మాయి సుమతి బి.యస్సీ ఫైనల్ చదువుతోంది. సుమలత బి.ఎ రెండో సంవత్సరం. ఆఖరి అమ్మాయి సునంద ఇంటర్ రెండో సంవత్సరంలో వుంది.

అందం, అణకువ, చదువుతోపాటు



1

మంచి ఉద్యోగం కూడ వుండటంవల్ల సహజంగానే పెళ్ళిసంబంధాలు భారతిని వెదుక్కుంటూ వచ్చాయి. ఇప్పటికే మూడు, నాలుగు సంబంధాలు కట్నంతో ప్రమేయం లేకుండానే చేసుకుంటామని ముందుకొచ్చారు. అందులో ఒకరు డాక్టరు, మరొకరు బ్యాంక్ ఆఫీసరు, మరిద్దరు కంప్యూటర్ ఇంజనీర్లు. ఇక్కడే పట్టాభిరామయ్య చిక్కుల్లో పడ్డాడు. నిజానికి అతని ఆలోచనలు వేరుగా వున్నాయి. భారతి మన అమ్మాయే కావచ్చు. కానీ పెళ్ళయిన తర్వాత భర్త సహకారం లేనిదే భారతి మాత్రం తనకు ఎలా సహాయపడగలదు? ఒకవేళ వారు సహకరించినా ఆత్మాభిమానం గల తండ్రిగా వారి సహాయం పొందడం ఏమంత సబబుగా వుంటుంది. అందుకనే అతను ఒక నిర్ణయాని కొచ్చాడు. తను చేస్తున్నది తప్పో, ఒప్పో! మిగిలిన అమ్మాయిల భవిష్యత్తుకోసం ఫలానా అబ్బాయి మంచివాడు కాదనో, జాతకాలు కుదరలేదనో, ఏదో ఒక సాకుతో భారతి పెళ్ళి వాయిదా వేస్తూ వస్తున్నాడు. అమ్మాయి అమెరికాలో రెండేళ్ళ జీతం వెనకేస్తే కనీసం నాలుగైదు లక్షలైనా మిగులుతుంది. ఆ డబ్బుతో ఇద్దరి పెళ్ళిళ్ళైనా చేయొచ్చు. లక్షల జీతం, హోదాగల ఉద్యోగం కాబట్టి అప్పుడైనా భారతి పెళ్ళి పెద్ద సమస్యకాదు. ఇదీ పట్టాభిరామయ్య విశ్వాసం.

కానీ సీతమ్మ ఆలోచనలు మరోలా వున్నాయి. దేశంగాని దేశంలో ఆడపిల్ల ఒంటరిగా ఎలా నెట్టుకురాగలదు? ఆ అమ్మాయి అదృష్టం కొద్దీ మంచి సంబంధం వచ్చింది. అబ్బాయి కూడ కంప్యూటర్ ఇంజనీరే! అతను కూడ మరో రెండు నెలల్లో అమెరికా వెళుతున్నాడు. కానీ కట్నం లేకుండా పెళ్ళి ఖర్చులు కూడ తామే భరిస్తామంటున్నారు. అలాంటప్పుడు ఇద్దరికీ ముడివేస్తే తర్వాత వాళ్ళెక్కడవున్నా తమ ప్రాణానికి నిశ్చింతగా వుంటుంది.

సీతమ్మ ఆరోజు రాత్రి మళ్ళీ పట్టాభిరామయ్యను కదిలించింది. 'ఏమండీ! మన ఇబ్బందులతో భారతి పెళ్ళి ముడిపెట్టకండి. తర్వాత పిల్లల భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి భారతి పెళ్ళి జరిపించండి. అమ్మాయి సంపాదన కోసం ఆశపడి పెళ్లిచేయకుండా దాటవేస్తున్నామని ఇప్పటికే అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. మీరింకేమీ ఆలోచించకుండా అబ్బాయి తల్లిదండ్రులతో అన్ని విషయాలు మాట్లాడి రండి. ఈ సంబంధమే ఖాయం చేస్తున్నట్లు భారతికి కూడ ఉత్తరం రాయండి. అమ్మాయికి కూడ ఈ సంబంధం పట్ల వ్యతిరేకత వుండదనే నేననుకుంటున్నాను' సీతమ్మ పట్టాభిరామయ్యకు హితబోధ చేసింది.

పట్టాభిరామయ్య మౌనంగా వింటూ పడుకున్నాడు. రాత్రంతా ఆలోచనలతో సతమతమయ్యాడు. సీత మాటలు కూడ సబబుగానే వున్నాయి. వయసు మీరిన తర్వాత పరిస్థితులెలా వుంటాయో? చదువు, అందం, ఆస్తి, చివరకు ఉద్యోగం అన్నీవున్నా పెళ్ళికాని అమ్మాయిల్ని తానెంతమందిని చూడలేదు? మబ్బుల్లో నీటిని నమ్ముకుని దోసిట్లో నీటిని ఒలకబోయడం మూర్ఖత్వమూ, అహంకారమూ అవుతుందేమో! సుమతి, సుమలతలు కూడ వాళ్ళ అమ్మతో వంతపాడుతూ అక్క పెళ్ళిచేయమనే అంటున్నారు. ఊరందరిదీ ఒకదారైతే ఉలిపికట్టెదొకదారని తానిలా మొండిపట్టు పట్టడం ఎంతవరకు సబబు? కూతురు, అల్లుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారంటే తనకు మాత్రం సంతోషంగానూ, గర్వంగానూ ఉండదా?

మరుసటిరోజు ఉదయమే పట్టాభిరామయ్య అబ్బాయి తల్లిదండ్రులతో మాట్లాడటానికి బయలుదేరాడు. ఈ విషయమే భారతికి ఉత్తరం రాసి బయలుదేరేముందే పోస్టుచేశాడు. సీతమ్మకు వేయి ఏనుగుల బలమొచ్చింది. విప్పారిన ముఖంతో సంతోషంగా భర్తను సాగనంపింది.



**సీత మాటలు కూడ సబబుగానే వున్నాయి. వయసు మీరిన తర్వాత పరిస్థితులెలా వుంటాయో? చదువు, అందం, ఆస్తి, చివరకు ఉద్యోగం అన్నీవున్నా పెళ్ళికాని అమ్మాయిల్ని తానెంత మందిని చూడలేదు? మబ్బుల్లో నీటిని నమ్ముకుని దోసిట్లో నీటిని ఒలకబోయడం మూర్ఖత్వమూ, అహంకారమూ అవుతుందేమో!**

వారంరోజుల తర్వాత 'పోస్ట్' అంటూ పోస్టుమాన్ ఒక ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. వంటగదిలో వున్న సీతమ్మ భర్త వద్దకు వచ్చింది. కుతూహలం ఆపుకోలేక 'ఎక్కడి నుంచి ఉత్తరం?' అంది.

'భారతి రాసింది' పట్టాభిరామయ్య జవాబు చెబుతూ కవరు చదువుకోసాగాడు.

ప్రియమైన నాన్నగారికి!

భారతి నమస్కారములు. మీ ఉత్తరం అందింది. విషయం బోధపడింది. కానీ నాన్నా! మీ మాట కాదంటున్నందుకు నన్ను క్షమించండి. నాకు ఇప్పుడిప్పుడే వివాహం చేసుకోవాలని లేదు.

నా వివాహ విషయంగా కొన్ని నెలల నుంచి మీరు, అమ్మ పడుతున్న ఆందోళన, తాపత్రయం, మీ హృదయంలో జరుగుతున్న సంఘర్షణ నేను అర్థం చేసుకోగలను. నా సుఖం నేను చూసుకుని వెళ్ళిపోయేంత స్వార్థపరురాలినా నాన్నా! ఒకప్పుడు అమ్మతో మీరంటూ వుండేవారు- అమ్మాయిలైనా, అబ్బాయిలైనా వీళ్ళేమనకు- అని. అదే కొడుకునైవుంటే చెల్లెళ్ళ మంచిచెడ్డలు నాకప్పగించేవారేకదా? ఇప్పుడు నేను మీ కూతురినైనంత మాత్రాన ఆ బాధ్యత స్వీకరించడానికి అనర్హురాలినా?

వివాహం చేసుకుని కూడ నేను నా భర్త సహకారంతో మన కుటుంబానికి సహాయపడగలనేమో? కానీ అందుకు గ్యారంటీ ఏమిటి? నా భర్త సహకరించకపోయినా నేనతన్ని ఎదిరించి మీకు సహాయపడవచ్చు. కానీ దానివల్ల ఫలితమేమిటి? మేమిద్దరం ఎడముఖం, పెడముఖంగా కాపురం సాగించాలి. అది మీకు మాత్రం సంతోషంగా వుంటుందా? గౌరవప్రదంగా వుంటుందా? చివరికి అతన్తో తెగతెంపులు చేసుకుని మన కుటుంబానికి సహకరిస్తూ ఒంటరిగానైనా జీవించవచ్చు. కానీ అలాంటి శుష్కమైన స్త్రీవాద నినాదాలు, మహిళా చైతన్య, ప్రగతివాద ఆందోళనల పట్ల నాకు నమ్మకంలేదు. నాఉద్దేశంలో సంసారమనే రథానికి భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాల్లాంటివారు. మహిళా చైతన్యం, మహిళాభ్యున్నతి అంటే స్త్రీ పురుషులిద్దరూ ఒకరినొకరు పరస్పరం అర్థం చేసుకుని, గౌరవించుకుంటూ కలిసి ముందుకు సాగడమేకానీ ఒకరికంటే మరొకరిది పైచేయి కావాలని పరస్పరం ద్వేషించుకోవడం కాదు. అలా పెళ్లయిన తర్వాత మనస్పర్థలతో విడిపోవడంకంటే పెళ్ళి చేసుకోకుండా వుండటమే మంచిదికదా!

కాబట్టి ప్రస్తుతానికి నా పెళ్ళి ప్రయత్నాలు మానండి. ముందు చెల్లెళ్ళ చదువు పూర్తికానివ్వండి. అదృష్టం కొద్దీ వారి కాళ్ళమీద వారు నిలబడేట్లు వారికి కూడ ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు. ఈలోగా నేను కూడ రెండు, మూడేళ్ళు అమెరికా వెళ్ళి వస్తాను. తర్వాత మీ ఇష్టప్రకారమే మా అందరి పెళ్ళిళ్ళు చేద్దురుగాని.

అక్కడ అమెరికాలో నేనొక్కదాన్నీ ఎలా వుండగలనోనని అమ్మ బెంగపడుతుందని నాకు తెలుసు. పాపం అమ్మ అమాయకురాలు. ఆమెకు నా మాటగా నచ్చజెప్పండి. ఎక్కడైనా మనుషులు- మనస్తత్వాలు ఒక్కటే. మన జాగ్రత్తలో మనం వుండాలి. ఆ తర్వాత నా పెళ్ళి అవుతుందో కాదోనని అధైర్యపడవద్దని అమ్మకు చెప్పండి. ఒకవేళ ఆరోజుకు నా పెళ్ళి జరక్కపోయినా నేను బాధపడను. ఎందుకంటే ఈ కొత్త మిలీనియంలో కూడ స్త్రీకి పెళ్ళి తప్ప వేరే జీవితమే లేదనుకోవడం పిచ్చితనమే అవుతుంది. పెళ్ళి స్త్రీ-పురుషులిద్దరికీ అవసరమే! కాదనను. కానీ ఎవరికైనా జీవిత పరమావధికాదు. ప్రస్తుతానికి నన్ను మీ పెద్దకొడుకుగా భావించి నా బాధ్యతలు నెరవేర్చనివ్వండి. నేనేమీ త్యాగం చేయడంలేదు. నాతోపాటు నా వాళ్ళందరూ బాగుండాలనే స్వార్థంతోనే ఈ నిర్ణయానికొచ్చాను. మనకు లోకంతో పనిలేదు. మనమార్గం సరైందన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు నడుద్దాం. మీరు మనసులో ఏమాత్రం సంకోచపడకండి. ఇంతకంటే నేను ఎక్కువగా ఏమని రాసేది? అమ్మకు నా నమస్కారములు. చెల్లాయిలను అడిగినట్లు చెప్పండి. నేను వీలుచూసుకుని ఇంటికి వస్తాను.'

వుంటాను ప్రేమతో,

మీ భారతి

ఉత్తరం సంపూర్తిగా చదివి పట్టాభిరామయ్య తన భావోద్వేగాలను ఆపుకోలేకపోయాడు. చెమర్చిన కళ్ళతో ఉత్తరం భార్య చేతికందించాడు. సీతమ్మ- పట్టాభిరామయ్యల మనోఫలకం మీద భారతి రూపం కదలాడింది. కోటానుకోట్ల ప్రజకు అభయమిస్తూ సాక్షాత్కరించిన శక్తిరూపిణి- భరతమాతలా తమ ముద్దుల పట్టి భారతి కొండంత అండగా కళ్ళముందు నిలిచినట్లు ఉప్పొంగిపోయారా దంపతులు. ●



## సినిమానే జీవితం కాదు: రవీనా

"నాకు వ్యక్తిగత జీవితం వేరు, వృత్తి వేరు. ఈ రెండింటినీ వాటి స్థానంలో ఉంచడమే నాకు ఇష్టం" అంటోంది రవీనా టాండన్. అయితే 'నేను చేసేపనిని నేను ఇష్టపడతాను. నా పనంటే నాకు ఎంతో ఇష్టం. సినిమాలో నటించే ప్రతి సన్నివేశం కూడా ముఖ్యమైందే. క్రమశిక్షణతో వ్యవహరించడం, సన్నివేశానికి మానసికంగా సిద్ధం కావడం అవసరంగానే ఫీలవుతాను" అని ఆమె చెబుతారు. వ్యక్తిగత జీవితాన్ని వృత్తిగత జీవితంతో ముడివేయడాన్ని రవీనా ఇష్టపడదు. అందుకే తన పర్సనల్ లైఫ్‌పై వచ్చే కామెంట్స్‌ను ఆమె లెక్క చేయదు. సినిమానే జీవితంగా తలంచదు. జీవితంలో అదొక భాగంగానీ జీవిత కార్యకలాపమంతా సినిమా రంగంతోనే ముడిపడిలేదని రవీనా అంటారు. సృజనాత్మకంగా జీవించడం, అవసరమైనప్పుడు కష్టపడుతూ తగిన విధంగా ఎంజాయ్ చేయడం ఆమె స్వభావం. అందుకే రవీనా ఒడిదుడుకులకు అతీతంగా ప్రశాంతంగా జీవిస్తుందని ఆమె అభిమానులు చెబుతారు. ●